పారదర్శక కౌంటింగ్‌కు సహకరించండి



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు, అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో వికాస్‌మర్మత్

- సమష్టిగా పనిచేస్తే విజయవంతం
- రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్

నెల్లూరు(బృందావనం) : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లు సహకరించాలని నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు, ఏజెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే కౌంటింగ్ ప్రక్రియలో మొదటిగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపట్టనున్నామన్నారు. అనంతరం 8.30 నుంచి ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులుగా శామ్యూల్, ప్రత్యూషలను ఎన్నికల సంఘం నియమించిందన్నారు. రాజకీయ పార్టీ అభ్యర్థులు తమ ఏజెంట్లకు కౌంటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఏజెంట్ల వివరాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందించి, వారికి సంబంధించిన ఐడీ కార్డులను తప్పనిసరిగా పొందాలని సూచించారు.

ప్రత్యేక మినీబస్సుల ఏర్పాటు

కనుపర్తిపాడు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పార్కింగ్ వసతి కల్పించామని, పాఠశాల నుంచి కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని కళాశాల వరకు ప్రత్యేక మినీబస్సుల సౌకర్యం కల్పించామని వికాస్ మర్మత్ తెలియజేశారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే వారందరికీ అన్నివేళలా అవసరమైన అల్పాహారం, స్నాక్స్, భోజన వసతిని ఏర్పాటు చేశారన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ల అనుమతి లేనందున వాటి కోసం ప్రత్యేకంగా ఫోన్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు తలెత్తిన పలు సందేహాలను ఆర్వో నివృత్తి చేశారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు, ఏజెంట్లు, సిబ్బంది సమష్టిగా పనిచేసి, కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఏఆర్వోలు శర్మద, దేవీకుమారి, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, శామ్యూల్, ప్రత్యూష, నాగేశ్వరరావు, చక్రపాణి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రపై సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైమ్) : వచ్చే నెల 2వ తేదీన జరిగే హనుమాన్ శోభాయాత్రకు సంబంధించి హిందూ, ముస్లిం మతపెద్దలతో సమన్వయ సమావేశాన్ని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యాత్ర నిర్వహణ తేదీ, మార్గం, జరిగే విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం లేకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. సున్నితమైన అంశం కావడంతో కులమతాలకు అతీతంగా సామరస్యం పాటించాలన్నారు. ఎవరి మనోభావాలు ఇబ్బంది కలగకుండా ఇరువురు సంయమనం పాటించాలని సూచించారు. ఇరు మత పెద్దలు ఒకరికొకరు సహకరించుకుంటామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

నూతన పాఠ్యాంశాలపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నెల్లూరు(వేదాయపాళెం) : హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి నూతన పాఠ్య పుస్తకాలు–అందులోని అంశాలపై రిసోర్స్ పర్సన్‌లకు(ఆర్పీలు) శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉదయభాస్కర్, కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన ఆర్పీలు జూన్ 23న భౌతికశాస్త్ర, జీవశాస్త్ర, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు నూతన పాఠ్య పుస్తకాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ నాయకుడు ఎమ్వీ చలపతి, గౌస్‌బాషా, కామయ్య, మస్తానయ్య, జిలానిబాషా, వంశీచరణ్, మారుతీకేశవ్, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జెనెక్స్‌లో జాబ్‌మేళా



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నెల్లూరు (టౌన్) : ముత్తుకూరు రోడ్డులోని జెనెక్స్ విజన్ బి-స్కూల్ క్యాంపస్‌లో ఐసీఐసీఐ లాంబర్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో జెనెక్స్ విజన్ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు రూ.3.5 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ లాంబర్డ్ జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ మేనేజర్ మధుసూదనరావు, క్లస్టర్ బ్రాంచ్ మేనేజర్ సయ్యద్ అల్తాఫ్ బాషా, పీజీ కళాశాల ప్రిన్సిపల్ తేజ, ప్లేస్‌మెంట్ అధికారి చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణభిక్ష పెట్టండి

- కుమారుడి ఆవేదన



మాట్లాడుతున్న శివకుమార్

నెల్లూరు(మినీబైపాస్) : మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన తల్లికి ప్రాణభిక్ష పెట్టాలని నెల్లూరుకు చెందిన ముత్యాలపాటి వెంకట శివకుమార్ కోరారు. స్థానిక న్యూ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తన తల్లి పార్వతి వైద్య ఖర్చుల నిమిత్తం ఇప్పటికే రూ.9 లక్షలు ఖర్చు చేశానని, ఇంకా రూ.20 లక్షల అవసరం ఉందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన తల్లిని దాతలు రక్షించాలని కోరారు. సాయం చేయాలనుకున్న వారు 70325 87031 నంబర్‌ను సంప్రదించాలని వేడుకున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

నెల్లూరు సిటీ : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గోమతినగర్‌లోని నారాయణ క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పొంగూరు నారాయణ, అజీజ్, బీద రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

- రూరల్ మండలంలోని సౌత్ మోపూరు గ్రామంలో టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు పముజుల ప్రదీప్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు.
- నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద కేంద్ర అగ్రికల్చర్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.
- నెల్లూరు(బృందావనం) : ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులో ఏపీ ఫిలిమ్‌చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించినట్లు నిర్వాహకుడు అనంత్ తెలిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
- నెల్లూరు(బృందావనం) : నగరంలోని గాంధీ బొమ్మ వద్ద ఉన్న స్వతంత్ర పార్కులో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్, గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సంయుక్తంగా ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

జీవనశైలి మార్పుతో ఆరోగ్యం

- డాక్టర్ శంకర్



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్ తదితరులు

నెల్లూరు(అర్బన్) : ప్రస్తుతం మనిషి తన జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మాజీ రిజిస్ట్రార్, ప్రస్తుత గుంటూరు వైద్యకళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ కె.శంకర్ తెలిపారు. ప్రజా సైన్స్ ఉద్యమ నేత డాక్టర్ జి.విజయకుమార్ తొమ్మిదో వర్ధంతి సందర్భంగా నగరంలోని డాక్టర్ జీవీకే ట్రస్ట్ నెల్లూరు ఆస్పత్రిలో 'జీవనశైలి వ్యాధుల నివారణ, అదుపు ఆహారం, ఉపవాసం పాత్ర' అనే అంశంపై మంగళవారం సాయంత్రం స్మారకోపన్యాసం జరిగింది. అంతకు ముందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శంకర్ మాట్లాడుతూ బీపీ, షుగర్, ఊబకాయం లాంటి సమస్యలు సమాజంలో 30 శాతానికి పైగా పెరిగాయన్నారు. వీటి వల్ల కిడ్నీ, లివర్, క్లోమం, ఊపిరితిత్తులు లాంటివి దెబ్బతింటున్నాయన్నారు. కేన్సర్, హృద్రోగాలు పెరిగాయన్నారు. వీటికి తోడు జల, వాయు, ఆహార కాలుష్యాలు పెరిగినందు వల్ల కొత్త జబ్బులు వస్తూ ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నాయన్నారు. వందేళ్ల క్రితం ఇలాంటి సమస్యలు లేవన్నారు. వీటికి ప్రధాన కారణం కార్బోహైడ్రేట్‌లు(పిండి పదార్థం) అధికంగా ఉండే బియ్యం, గోదుమలు, రీఫైండ్ లాంటి నూనెలు కారణమన్నారు. అందువల్ల పిండి పదార్థాలను సాధ్యమైనంత వరకు వీడాలన్నారు. కాయగూరలు, ప్రోటీన్స్ అధికంగా ఉండే పప్పులు, నెయ్యి, గుడ్డు, మీగడ, వెన్న లాంటివి వినియోగించాలన్నారు. నాటు జామ, అవకాడో లాంటి ఫలాలు తీసుకోవాలన్నారు. 16 గంటల ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపాలన్నారు. ఇవన్నీ తాను ప్రయోగాల ద్వారా నిరూపించానన్నారు. మెడికల్ పీజీ చేస్తున్న తన విద్యార్థులు సైతం ఇలాంటి ప్రయోగాలు చేసి అద్భుత ఫలితాలు సాధించారన్నారు. ట్రస్ట్ నిర్వాహకుల్లో ఒకరైన మాల్యాద్రి మాట్లాడుతూ దివంగత డాక్టర్ విజయకుమార్ స్ఫూర్తితో ప్రజారోగ్యం కోసం తాము ఇలాంటి సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు వేణు, గాలి శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, నూనె నారాయణ, న్యాయవాదులు అబ్బాయిరెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా ఉంటే భారీ జరిమానాలు

- వ్యాపార, వాణిజ్య కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ



దుకాణాల్లో తనిఖీలు, పారిశుద్ధ్యం పర్యవేక్షిస్తున్న వెంకటరమణ

నెల్లూరు(బృందావనం) : నగరపాలక సంస్థ పరిధిలోని ఆహార విక్రయ కేంద్రాల వద్ద పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భారీ జరిమానాలు విధిస్తామని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశాల మేరకు చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు ప్రధాన మార్గంలో ఉన్న వివిధ హోటళ్లు, బేకరీలు, ఆహార విక్రయ కేంద్రాల ప్రాంగణాలను మంగళవారం డాక్టర్ వెంకటరమణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వ్యాపార, వాణిజ్య ప్రాంగణాల్లో చెత్తబుట్టలను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. వాటిపై నగరపాలక సంస్థ కేటాయించిన లోగో స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. ఈ క్రమంలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించని వివిధ దుకాణాలకు రూ.10 వేలు జరిమానాలు విధించి కొన్ని దుకాణాలను మూసివేశారు.

ప్లాస్టిక్ ఉత్పత్తులపై తనిఖీలు

నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై డాక్టర్ వెంకటరమణ నేతృత్వంలోని ఆరోగ్యశాఖ విభాగ బృందం వివిధ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ క్రయవిక్రయాలు జరపరాదని దుకాణ నిర్వాహకులను వివరించారు. అదేవిధంగా ప్రజలందరూ కార్పొరేషన్ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నెల్లూరు(అర్బన్) : వేస్ట్ పేపర్లతో వస్తువులను తయారు చేయిస్తున్న ఉపాధ్యాయుడు



నెల్లూరు(అర్బన్) : మొలకెత్తిన విత్తనాల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయిని విజయమ్మ

- వివిధ అంశాల్లో చిన్నారులకు శిక్షణ

నెల్లూరు(అర్బన్) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి బాల, బాలికలకు స్థానిక మైపాడు గేట్ వద్ద నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో వేసిన విత్తనాలు మొలకెత్తిన విధానాన్ని, అందుకు అనుకూలించిన వాతావరణ పరిస్థితులను ఆరో రోజు మంగళవారం పిల్లలకు వివరించారు. వేస్ట్ పేపర్స్‌తో వివిధ డిజైన్‌లతో కొన్ని రకాల వస్తువులను ఎలా తయారు చేయించాలో ఆంగ్ల ఉపాధ్యాయుడు రత్నశేఖర్ నేర్పించారు. ఫొటో ఫ్రేమ్ తయారీ విధానాన్ని తెలియజేశారు. పిల్లల చేత పలు రకాల ఆటలు ఆడించి పాటలు పాడించారు. ఈ సందర్భంగా జేవీవీ మహిళా విభాగం నేత, ఉపాధ్యాయిని విజయమ్మ ఆటల అవసరాన్ని, ఉపయోగాలను, మానసిక ఆనందాన్ని, ఐక్యతను వివరించారు. అనంతరం బాల, బాలికలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

- నెల్లూరు(మినీబైపాస్) : నగరంలోని రంగనాయకులపేట, ఏకేనగర్ చిల్డ్రన్స్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. చిన్నారులతో వివిధ రకాల ఆటలు ఆడించారు. ఏకేనగర్ గ్రంథాలయంలో పిల్లలతో పేపర్ క్రాఫ్ట్ గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి మేరీ పాల్గొన్నారు.



నెల్లూరు(మినీబైపాస్) : రంగనాయకులపేట గ్రంథాలయంలో..

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ సిబ్బంది

నెల్లూరు (క్రైమ్) : ఎన్నికల కౌంటింగ్ సమయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సమన్వయం పాటించాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. నగరంలోని చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న నెక్లస్‌రోడ్డు, మన్సూర్‌నగర్, కోటమిట్ట, జండా వీధి, ఆచారివీధి తదితర ప్రాంతాల్లో ఆయన స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు పలు సూచనలు చేశారు.

పొరపాట్లు లేకుండా చూడండి



ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బృందావనం) : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ తెలిపారు. నగరంలోని కనుపర్తిపాడు ప్రియదర్శిని కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి అవసరమైన తాగునీరు, భోజన సదుపాయాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. కళాశాల ప్రాంగణంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పారిశుద్ధ్య కార్మికులు ప్రణాళికాబద్ధంగా పనులను చేపట్టాలన్నారు. భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణం నేడు

నెల్లూరు(బృందావనం) : శ్రవణా నక్షత్రం సందర్భంగా బాలాజీనగర్‌లోని శ్రీసీతారామస్వామి మందిరంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం జరుగనుందని మందిర కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. తొలుత ఉదయం 8 గంటలకు స్వామివారికి శాస్త్రోక్తంగా, సాంప్రదాయంగా పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగనుందని వివరించారు. రాత్రి 8 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు శ్రీవారి కల్యాణంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. కలియుగదైవం కృపకు పాత్రులు కావాలన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



డాక్టర్ విజయకుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన నాయకులు

నెల్లూరు(అర్బన్) : రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను రక్షించవచ్చని ప్రజాసైన్సు వేదిక రాష్ట్ర నాయకులు మాల్యాద్రి అన్నారు. ప్రజా సైన్సు ఉద్యమ నేత డాక్టర్ జి.విజయకుమార్ తొమ్మిదో వర్ధంతిని మద్రాస్‌బస్టాండ్ సమీపంలోని డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ ట్రస్ట్ నెల్లూరు హాస్పిటల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని, పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ సారా వ్యతిరేక ఉద్యమ కన్వీనర్‌గా, ప్రజాసైన్సు ఉద్యమ నేతగా, పర్యావరణ ఉద్యమ నేతగా, డాక్టర్‌గా విజయకుమార్ ఎన్నో సేవలందించారన్నారు. అలాంటి వ్యక్తి ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు వారు రక్తం సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నెల్లూరు హాస్పిటల్ ఎండీ గోపాల్, ట్రస్ట్ నిర్వాహక నాయకులు గాలి శ్రీనివాసులు, నూనె నారాయణ, కె.శ్రీనివాసులు, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, వేణు, బ్లడ్‌బ్యాంకు కన్వీనర్ అజయ్‌బాబు, న్యాయవాదులు అబ్బాయిరెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు ప్రాంతాల్లో పేదలకు మంగళవారం ఆహార ప్యాకెట్లను అందజేశారు. అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పెన్నా బ్రిడ్జి, వెంకటేశ్వరపురం పెన్నా పరీవాహక ప్రాంతాల్లో ఉంటున్న పేద ప్రజలకు భోజన ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు రమేష్‌బాబు మాట్లాడుతూ పేదలకు సాయం చేసేందుకు తమ ఫౌండేషన్ సిద్ధంగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రీతమ్, చేతన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల అందజేత



నెల్లూరు(బృందావనం) : నగరంలోని నిరుపేదలను గుర్తించి వారికి మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కలిగిస్తుందని మలబార్ గ్రూప్ నెల్లూరు షోరూమ్ హెడ్ షాహిల్ తెలిపారు. స్థానిక మినీబైపాస్‌లోని మలబార్ షోరూమ్ వద్ద మంగళవారం భోజన ప్యాకెట్ల పంపిణీ వాహనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదలకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ గోకుల్, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృత్వం స్త్రీకి వరం



మాట్లాడుతున్న సెట్నల్ సీఈఓ వెంకటయ్య

నెల్లూరు(అర్బన్) : ప్రతి స్త్రీకి మాతృత్వం ఒక వరమని సెట్నల్ సీఈఓ వెంకటయ్య అన్నారు. స్థానిక వేదాయపాళెంలోని రిచ్ నర్సింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్నల్, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్త్రీ రుతు శుభ్రతపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. లేదంటే గర్భకోశ వ్యాధులు సోకి భవిష్యత్తులో మాతృత్వాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ ప్రాజెక్ట్ అధికారి సమత మాట్లాడుతూ సృష్టిలో స్త్రీగా పుట్టడం అదృష్టమన్నారు. స్త్రీలకు నెలసరి క్రమం తప్పకుండా రావాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రోజువారీ వ్యాయామం ఉండాలన్నారు. రుతు క్రమంలో ప్రతి మూడు గంటలకు ఒక దఫా ప్యాడ్స్ మార్చుకోవాలని తెలిపారు. ప్రజారోగ్య నర్సింగ్ అధికారి మంజుల, సీడీపీఓ అన్నపూర్ణ, ఎంపీహెచ్ఎస్ ప్రేమలత, సూపర్‌వైజర్ సుజాత, బాలికలు పాల్గొన్నారు.